పెరట్లో ఏదో పెద్ద చప్పుడయినట్టు తోచి, తుళ్ళిపడి లేచాడు చలపతి.

కంగారులో మంచం మీంచి కింద పడ్డాడు. 'సమయానికి కళ్ళు మూసేస్తాడు, మాయదేరి దేవుడు,' అనుకుంటూ కళ్ళు మరోసారి నులుపుకొని, పెరటి గుమ్మం వైపు చూశాడు. తాను కాపలా పెట్టిన కొడుకు ముందుకు పడిపోయి కునుకు తీస్తున్నాడు!

దగ్గరగా వెళ్ళి ముందుకు పడిన పొడుగు వెంట్రుకలు దొరకపుచ్చుకుని బలంగా వెనక్కి లేవనెత్తేడు. వాడు తెలివి తెచ్చుకుంటూనే చిందులు మొదలెట్టేడు.

ఎవరికేది ప్రాప్తమో!

అవసరాల రామకృష్ణారావు

'నువ్వెంతిచ్చినా సరే, నేనీసారి యిక్కడ ఉండనూ ఫో....'

'బంయ్'మని పైకి రాబోతున్న వాడి స్వరాన్ని కుడిచేత్తో మూసి, ఎడం చేత్తో వాణ్ని లోపలికి రాకుండా పక్కగోడకి తొక్కిపెట్టి'

'ఒరే ఒరే నీ పుణ్యం ఉంటుంది అరవకురా మళ్ళీ మీ అమ్మ లేచి పోతుందిరా.... కాయకి పది పైసలు చొప్పున దొబ్బుతున్నావు కాదుట్రా?'

'అయితే మాత్రం. జుట్టూడి వచ్చేలా లాగుతావా. ఇప్పటికీ మంట తగ్గలేదే! ఈసారి కాయకు పావలా చొప్పున పెంచితే గాని నేనీ దరిద్రప్పని చెయ్యలేను. నిద్రాపుకోలేక ప్రాణాలు పోతున్నాయి బాబూ!'

'పోనీ అలాగే చేస్తాను లేరా ... ఆ అడిగేదేదో కాస్త నెమ్మదిగా అఘోరించి చావరాదూ? నూకాలమ్మలా అంత స్వరం ఎందుకూ? మళ్ళీ ఆ సుబ్బన్నగాడు గనక లేచిపోతే రెండ్రూపాయల కాయా మన చేతిలో పడకుండా పోతుందే! వెంటనే వెళ్ళి తీసుకు రారాబాబూ.'

'మునపట్లా కాదయితే. ముందస్తుగా పావలాకాసు ఎక్కడుందో తీసి చేత్తో పట్టుకు నిలబడితేనే నేనిక్కణ్ణుంచి కదిలేది తెలుసా?'

'ఓరి నీ అసాధ్యం గూల, బాగా తయారయ్యేవే!'

అని పైకయితే అన్నాడుగాని, కొడుకు క్రమక్రమంగా వృద్ధిలోకి వస్తున్నందుకు లోలోపల సంతోషించక పోలేదు చలపతి.

వాడూ అలా ముందుకు వెళ్ళగానే ఆ తండ్రి మనసు అలా వెనక్కి యింకా వెనక్కి మళ్ళింది.

అవును మరి, అందరికీ ఈ ప్రపంచంలో మంచిగానే బతకాలని ఉంటుంది. కాని ఎదుటివాడు అలా బతకనియ్యొద్దూ!

ఇరుగూ పొరుగూ అన్నాక ఇచ్చిపుచ్చుకోడాలు ఉండాలి. తన కుటుంబం యిలా ఈ వాటాలోకి అద్దెకి వచ్చారో లేదో ఆ పక్క వాటాలో అద్దెకున్న సుందరమ్మ అలా చెప్పడం ఏమైనా బాగుందీ!

'చూడండి అన్నయ్యగారూ! ముందు నీళ్ళనవలడం, వెనకాతల శాపనార్థాలు పెట్టడం, యిలాంటి చచ్చుపనులు నాకు చేతకావు. నాదంతా రైట్ రాయల్ రోడ్. అందుకనే నేనంటే చాలా మందికి కిట్టదు. పోన్లెండి, నా కొచ్చిన నష్టం కూడా ఏమీ లేదు. వింటున్నారా? ఈ యింటి వాళ్ళు సికింద్రాబాదులో వున్నారు. వారూ, మా వారూ ప్రాణ స్నేహితులు. మీరు నెలనెలా ఒకటో తారీకుకి అద్దెమాకేయివ్వాలి. మీదీ, మాదీ కలిపి మేం మనియార్డరు చేస్తాము. ఇంకో ముఖ్య విషయం ఉంది. చెప్పేనుగదా యింటి పూచీ అంతా మా మీదే పెట్టారని. చూస్తున్నారుగదా పెరటి నిండా కొబ్బరి చెట్లు ఉన్నాయని. వాటి మీద మనకేమీ అధికారం లేదు. దింపించిన కాయలేకాక, పడిన కాయలైనాసరే మనం ముట్టుకోడానికి లేదు. ఇలాంటివి ముందే స్పష్టం చెయ్యడం నా తత్వం. నాదంతా రైట్ రాయల్ రోడ్. ఎక్కువ పెరటి భాగం అంతా మీ వైపే వుంది. బాగా పక్వానికి వచ్చిన కొబ్బరిబొండాలు కదా.... ఇలా గాలి వీస్తే అలా రాలి పోతాయి. పరాయి సొమ్ము మీకెందుకు, నాకెందుకు? మీ పిల్లవాడిచేత యిలా ంపించినా సరే, మాకు కబురెట్టినా సరేవ .... ఇలా రాలినవీ, అప్పుడప్పుడు తీయించినవీ—బజార్లో అమ్మించి ఆ డబ్బులూ అద్దె డబ్బూ అంతా కలిపి ఏ నెలకానెల యజమానికి పంపించెయ్యాలి. మీరు మరోలా చేస్తారని కాదు.

మీరు మరోలా చేస్తారని కాదుగాని..."

విషయం అర్థమైంది గనక యింక ఆ బోరు భరించలేక చలపతి లోపలకి తప్పు కున్నాడు గాని ఏమిటో మొట్టమొదటి రోజే యిలా హెచ్చరించడం ఇన్సల్టింగ్‌గా తోచింది. అదే విషయం ఆలోచించి ఆరా తీసేలా చేసింది.

అమ్మో ఆ సుందరమ్మకి తక్కువ కాపీన్నం ఉందనా! పదిపైసల తోట కూరకి గంటపైగా బేరమాడుతుంది. ఇంట్లో ఎన్ని సామాన్లున్నా ఏదీ పైకి తీసి హాయిగా వాడుకోలేని మురికి మనిషి.

ఆ మొగుడు, సుబ్బన్నగాడు ఎంత దర్జా పురుషుడో ఇదంత 'కక్కుర్తి మనిషి. ఇలాంటిది ఎక్కడో మొగుడి స్నేహితు డికి-కింద పడిన కొబ్బరికాయతో సహా- పుట్టమీద పెట్టినట్టు అప్ప చెప్తోందంటే- ఎంత ఎడ్వర్టైజ్‌మెంట్ చేస్తే మాత్రం నమ్మేవాళ్ళు అంత వెర్రివెధవలుటండీ!

తన సొమ్ముకాదు, తన లోకం కాదు.... దీనికెవడిచ్చాడు ఈ అథార్టీ.... ఆ మాత్రం యిరుగూ పొరుగూ యిచ్చి పుచ్చుకోడాలు లేకపోతే అది మనిషా? తను తినావచ్చు యింకొకరికి పెట్టావచ్చు. అలాంటిది ఎదుటి సొమ్ము కాపాడ్డం కోసం యింతలా దేవుళ్ళాడు తోందంటే యిందులో ఎంత స్వార్థం గూడుకట్టుకుని ఉందో!

ఇంకేం, ఈ క్రాస్‌వర్డ్ పజిల్‌కి కి సొల్యూషన్ నిమిషాల మీద పట్టేశాడు చలపతి.

ఏ రోజు చూసినా సుబ్బన్న గారింట్లో కొబ్బరికాయ పచ్చడే.

ఎప్పుడు చూసినా వాళ్ళింట్లోంచి కొబ్బరి నూనె పోపు వాసనే.

నెలకోసారయినా తలకి రాసుకునే కొబ్బరి నూనె రెండు పెద్ద హార్లిక్సు సీసాలకి సరిపోయేది- వాళ్ళు గానుగ ఆడించుకుని- తమ యింటి ముందునుంచే లోపలికి తరలించుకుంటూ ఉంటారు.

కొబ్బరి ఈనెల చీపుళ్ళు కట్టించి అమ్మిస్తూ ఉంటుంది ఆవిడ. 'ఇదంతా సంఘసేవే అందూ' అన్నాడు చలపతి పెళ్ళాంతో. కొన్నాళ్ళపాటు యిదంతా గమనించి. 'ఏదైతేనేం, మనకేం సంబంధం? పోనీ వీళ్ళు తింటున్నారే అను కుందాం. వాళ్ళ ఫ్రండ్స్‌వరో వాళ్ళకా అవకాశం యిచ్చారు. మధ్యని మనకేం?' అని విసుక్కుంది మహాలక్ష్మి.

'ఎవర్దో సొమ్ము తినడానికి వీళ్ళెవ రంట?'

'మనకేం పోయిందండీ.'

'ఏం పోయిందా. తప్పు జరుగుతూంటె ఊరుకోడం ఆ తప్పుని ప్రోత్సహించినంత తప్పు.'

'ఇరుగు పొరుగులతో మనకెందుకు బాబూ రొష్టు?'

'ఇరుగూ పొరుగూ కనకనే అప్పనంగా తనంతగాపడేసుకొంటోందే-సాటి ఆడదానివి కదా....పునిస్త్రీ పడుచువి నీ చేతిలో ఓ కొబ్బరి బొండాం పసుపు కుంకుమతో యిచ్చుకుంటే దాని మొగుడు ఆయుస్సు తగ్గిపోతుందా? చేస్తున్నది నూటికి నూరుపాళ్ళు దగుల్బాజీ పనీ. మళ్ళీ యింటికి అద్దెకెవరైనా దిగుతే దాని బాబుగారి యిల్లయినట్టు రూల్సు వల్లిస్తూ 'నాది రైట్ రాయల్ రోడ్' అంటూ టముకు కొట్టుకుంటుందా? ఆ మధ్య రెండ్రోజులపాటు ఎవరూ చూడకుండా పెరట్లో ఉండిపోయిందని బొండాం ఒకటి తీసి మన కుర్రాడు— కుర్రాడుగదా యింట్లో పెడితే ఊరూ వాడా గోల చేస్తుందా. ఇదేదో నేను చూడకపోతానా?'

ఈ మొగుడు ఎప్పటికైనా అర్థమవుతాడా అని మహాలక్ష్మి అలా కాపురానికి వచ్చినప్పట్నుంచీ చూస్తూనే ఉంది. పుట్టిన కొడుక్కి పదేళ్ళయితే వచ్చాయి గాని ఆమెకి అనుకున్నది బోధపడ్డలేదు. ఏవో చిన్న చిన్న విషయాలకి బోలెడంత ప్రాముఖ్యత యిచ్చి వారాలూ, నెలలూ, సంవత్సరాలూ గడిపేస్తాడు. తనకీ. మొగుడికీ ఆలోచనల్లోనేకాదు రూపంలో కూడా పోల్చి పట్టలేనంత వైరుధ్యం. పదేళ్ళ పిల్లాడికి తను తల్లి అంటే ఎవరూ ఒప్పుకోరు. 'మీ తమ్ముడా?' అని మొహం మీదే అడుగుతారు. 'ఎంతయినా ఆడపిల్ల పాపం ఎన్నాళ్ళకీ పెళ్ళికాక రెండో పెళ్ళి వాడికి యిచ్చేశారు కాబోలు' అని వెనక అనుకోడం ఎన్నిసార్లో స్వయంగా వింది తనూ మొగుడు ఎక్కడికైనా వెడుతూంటే. తన లాంటి మధ్య తరగతి మహిళకి అసంతృప్తి, నిట్టూర్పులూ తప్ప ఏం మిగులుతాయి? ఇలాంటి మొగుడితో ఓ ముద్దా, ముచ్చటా? చెప్పుకుంటే సిగ్గుచేటు- అతనితో దాంపత్య సుఖం కూడా అంతంతమాత్రమే.

మొగుడి కేకలతో మహాలక్ష్మి మళ్ళీ ఈ లోకం లోకి వచ్చింది. నే చెబు

తున్నది వినడానికూడా నీకు ఓపిక ఉన్నట్టు లేదే? ఏం చెయ్యను? నీలా, అన్యాయం జరుగుతూంటే ఊరుకునే చేతకానితనం నాకు లేదు. ఈ సుందరమ్మకి త్వరలోనే బుద్ధి చెప్పకమానను ఇంతకీ ఆవిణ్ణి అలా ఆడింది ఆటా పాడింది పాటగా తయారు చేసిన ఆ సుబ్బన్న గాడిని అనాలి.

చలపతి మాటలకి మహాలక్ష్మి సపోర్టు ఇవ్వదుగాని సుందరమ్మ ఏం చెబుతున్నా సుబ్బన్న పక్కనే ఉండి 'అవునవును' అనడం, చాలా స్పీడుగా తల ఊపడం ఎప్పుడూ జరిగేదే. అందుకే సుబ్బన్న అంటే చలపతికీమధ్య మంట ఎక్కువైంది.

ఇంతకీ చలపతి అట్టే కష్టపడకుండానే అతని కోరిక ఈడేరే అవకాశం కనిపించింది. దేవుడు దయామయుడు గదా?

ఆఖరి చెల్లెలి పెళ్ళి నిశ్చయమైందిట. రమ్మని కబురొస్తే, నెల్లాళ్లపాటు ఉండి రావడానికి సుందరమ్మ పుట్టింటికి వెళ్ళిపోయింది. వెళ్ళే ముందు మొగుడికి ఓ వంద జాగ్రత్తలూ, ఓ వెయ్యి హెచ్చరికలూ వడ్డించి మరీ వెళ్ళింది. ఇందులో తొంభై శాతం కొబ్బరికాయల క్షేమం గురించే.

చలపతి ఎంతో ఆతృతతో ఎదురు చూస్తున్నదీ అందుకే.

అంటే సుందరమ్మగాని, చలపతిగాని మనస్ఫూ కోరుకున్నది వారు అద్దెకున్న యింట్లో ఉన్న నారికేళ సంక్షేమం. ఇల్లు కట్టుకుని. ఆ మొక్కలన్నీ వేసి, కష్టపడి పెంచి పెద్ద చేసిన ఇంటి యజమాని క్షేమం మాత్రం కాదు?

అంతే. నడుం బిగించి రంగంలోకి దిగిపోయాడు చలపతి.

'నా చేత్తో నేనై వాళ్ళ కొబ్బరికాయలు చస్తే యింటికి చేర్చేది లేదు' అని ముందే చెప్పేసింది మహాలక్ష్మి.

చలపతి అయినా, సుబ్బన్న అయినా ఉద్యోగాలు చేసుకుని ఇల్లు చేరేది చీకటి పడ్డాకే. ఆ సీజన్లో ఆ ప్రాంతాల్లో రాత్రి వేళ తరుచూ ఈదురుగాలి వేస్తూ ఉండేది. రాత్రి పూట విధిగా నాలుగైదు కొబ్బరి బొండాలు రాలేవి. కొడుక్కి లంచం యిచ్చి పడిన బొండాలు యిల్లు చేర్పించేవాడు చలపతి.

'అర్ధరాత్రి ఏమిటి ఈ పాడు గోల? నన్ను పడుకోనిస్తారా లేదా?' అంటూ ఆ నారికేళ చోరకేళితో విసుగెత్తిపోయిన మహాలక్ష్మి ఓనాడు నానా గోల చేసింది.

'సాయం చెయ్యవలసింది పోయి మొగాళ్ళు కష్టపడి ఇల్లు నింపుతుంటే నీకేం తీపు దిగదీసిందేం?'

'రాత్రి నిద్రలేకపోతే పొద్దుట నేను పని చెయ్యలేను. మీ కేం?'

'అయితే సరే ఓ పని చెయ్యి. వీధి గదిలో మడత మంచము వేస్తా.ఆ గదిలో నువ్వు పడుకో. అడ్డ గడియ పెట్టుకో. తెల్లారేదాకా నిన్ను లేపితే అడుగు. సరేనా?'

పెళ్ళానికి ఎలాగో బోధపరచి ఒప్పించాడు చలపతి.

'దొంగ పీనుగ. దీనికి దిగమింగటానికి హక్కుంది. నాకు లేకపోయింది? ఇదే పాపం కడుతోంది అద్దె? పాపం మొగుడికి అప్పజెప్పి వెళ్ళింది వెర్రిముండా కూతురు. వాడు రాత్రి పడుకుంటే ఇక తెల్లగా తెల్లారాకే లేచేది? ఈ పదిరోజులకీ ఎన్ని చేరేశామో చూడరా?' అని మూల గదిలో చేరేసిన కొబ్బరి బొండాల కుప్ప వైపు సగర్వంగా, తృప్తిగా చూసుకుంటూ అన్నాడు చలపతి కొడుకుతో....

అయితే....

అప్పటికి నాలుగు రోజులై ఇంచుమించు అదే వేళకి చలచల్లగా పక్కింటి పడకగదిని చేరిన మహాలక్ష్మి సుబ్బన్న కౌగిలిలో సుఖసంతోషాలకు అసలైన అర్థం తెలుసుకొంటోందని చలపతికి తెలిసే అవకాశం మాత్రం ఇప్పట్లో లేదు?